నేటినుంచి పది పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- కొయ్యలగూడెం డివిజన్‌లో పరీక్షలకు హాజరుకానున్న 5223 మంది విద్యార్థులు
- లక్కవరం పరీక్షా కేంద్రంలో సీసీ కెమేరాల ఏర్పాటు


లక్కవరం పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల సర్వైలెన్స్ మానిటరింగ్ దృశ్యం

మండలం	పాఠశాలలు	పరీక్షా కేంద్రాలు	రెగ్యులర్ విద్యార్థులు	ప్రైవేట్ విద్యార్థులు	మొత్తం
కొయ్యలగూడెం	16	04	791	138	929
పోలవరం	09	02	348	88	436
బుట్టాయగూడెం	17	03	697	104	801
జీలుగుమిల్లి	11	02	427	98	525
కుకునూరు	08	02	293	62	355
వేలేరుపాడు	04	01	162	13	175
జంగారెడ్డిగూడెం	29	08	1745	257	2002
టి.నరసాపురం	09	03	445	38	483

జంగారెడ్డిగూడెం: పదో తరగతి పరీక్షలకు డివిజన్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కొయ్యలగూడెం డివిజన్‌లో మొత్తం 8 మండలాలు ఉన్నాయి. కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, కుకునూరు, వేలేరుపాడు, జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం మండలాలు ఉన్నాయి. ఈ 8 మండలాల్లో 22 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2 ఫ్లయింగ్ స్క్వాడ్, 4 సిట్టింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను నియమించారు. అలాగే ముగ్గురు అదనపు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌లను నియమించారు. ఈ ముగ్గురూ కూడా రూట్ ఆఫీసర్‌లుగా వ్యవహరిస్తారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మంచినీటి సౌకర్యం, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. పకడ్బందీగా పదవ తరగతి పరీక్షాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రానికి ఇన్విజిలేటర్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు కూడా సెల్‌ఫోన్‌లు తీసుకురాకూడదు. ఏదైనా అత్యవసర సమాచారం ఉన్నతాధికారులకు అందజేయాలంటే ఆ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న పోలీసు దగ్గర ఉన్న సెల్‌ఫోన్ వినియోగించుకోవాలి. డివిజన్ మొత్తంలో 5,223 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు అవుతుండగా, వీరిలో రెగ్యులర్ 4,463 మంది, ప్రైవేట్ 760 మంది విద్యార్థులు హాజరువుతున్నారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం



నేటి నుంచి జరిగే పదో తగరతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాం. డివిజన్‌లో మొత్తం 22 కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రతి కేంద్రంలోనూ మంచి నీటి సౌకర్యం, వైద్యులను ఏర్పాటు చేశాం.

– ఎం.రామన్నదొర, డీవైఈవో, కొయ్యలగూడెం డివిజన్

లక్కవరంలో సీసీ కెమేరాల ఏర్పాటు

జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం పరీక్షా కేంద్రంలో ప్రత్యేకంగా సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు. గతంలో ఈ కేంద్రంలో మాస్ కాపీయింగ్ జరిగిందనే ఆరోపణలతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కేంద్రాన్ని సంశయాత్మక కేంద్రంగా గుర్తించి సీసీ కెమేరాల సర్వైలెన్స్ ఏర్పాటు చేశారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 3 కేంద్రాలు

నేటినుంచి జరిగే ఓపెన్ స్కూల్ పరీక్షలకు 3 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటితో ఇంటర్ పరీక్షలకు 2 కేంద్రాలు ఏర్పాటు చేయగా, స్థానిక ప్రతిభ స్కూల్, నారాయణ స్కూల్‌లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పదో తరగతి ఓపెన్ పరీక్షలకు సూర్య కళాశాలలో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ఘనంగా అయ్యప్ప దేవస్థానం వార్షికోత్సవం


అయ్యప్ప క్షేత్రంలో గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానం 10వ వార్షిక వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజ, అంకురారోపణ, అఖండ దీపారాధన, నవగ్రహ వాస్తు యోగిని, ప్రథమ మండపారాధన, కలశస్థాపన, విద్యాగణపతి హోమం వంటి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆర్డీవో ఝాన్సీ రాణి కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. తొలుత వారికి ఆలయ శాశ్వత చైర్మన్ కీసరి రామిరెడ్డి, మమత దంపతులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం శేషవస్త్రంతో ఆర్డీవో ఝాన్సీరాణిని సత్కరించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 6 గంటలకు పడిపూజ నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

నేటినుంచి 'మా నమ్మకం నువ్వే జగన్'

లింగపాలెం : మండలంలో సోమవారం నుంచి మా నమ్మకం నువ్వే జగన్ ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు తెలిపారు. ఈమేరకు సోమవారం ఉదయం 10 గంటలకు అశన్నగూడెం సచివాలయంలో ప్రారంభమై అనంతరం వేములపల్లి, ముడిచెర్ల, రంగాపురం, కెగోకవరం-1, అన్నపనేనివారిగూడెం, ములగలంపాడు సచివాలయాలలో మొదటి రోజు ప్రచార కార్యక్రమం జరుగుతందన్నారు. ఈ సందర్భంగా శాంతరావు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని గృహసారథులు, గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటి వద్ద కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు స్టిక్కర్ అంటించి, ప్రజామద్దతు పుస్తకం అందజేయాలన్నారు. లబ్దిదారుల మొబైల్ ఫోన్‌పై స్టిక్కర్లు అంటించాలని ఆయన తెలిపారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలను పోల్చే కరపత్రాలు ఇంటింటికీ అందజేయనున్నట్లు శాంతారావు తెలిపారు.

శ్రీవారికి ఇరుముడుల సమర్పణ


శ్రీవారి ఆలయంలో దీక్షలు విరమించిన భక్తులు

ద్వారకాతిరుమల: కాకినాడ జిల్లా చీడిగకు చెందిన శ్రీవారి దీక్షాదారులు పలువురు ఆదివారం ఇరుముడులను సమర్పించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన వారు ఇరుముడులతో స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 30 మంది దీక్షాదారులు ఇరుముడులు సమర్పించారు. చీడిగలోని దశావతార వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో గతవారం తామంతా దీక్షను చేపట్టినట్టు చెప్పారు.

మండపాకకు తరలివెళ్లిన శ్రీవారి ధర్మప్రచార రథం

శ్రీవారి ధర్మప్రచార రథం తణుకు మండలం మండపాకకు ఆదివారం మధ్యాహ్నం పయనమైంది. ముందుగా ఆలయం వద్ద అధికారులు కొబ్బరికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు. అనంతరం ద్వారకాతిరుమల శివారు లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాధ వెంకటేశ్వర స్వామివారి ఆలయం వద్ద అర్చకులు రథానికి హారతులిచ్చారు. అనంతరం అక్కడ బయల్దేరిన రథం మండపాకలోని ఎల్లాలమ్మ ఆలయానికి చేరుకుంది. అక్కడ ఆలయంలో శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు కల్యాణాన్ని అట్టహాసంగా నిర్వహించారు.

పరీక్షా సామగ్రి అందజేత


విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందిస్తున్న సందీప్

లింగపాలెం : ధర్మాజీగూడెం సాంఘీక సంక్షేమ వసతి గృహంలోని పదో తరగతి విద్యార్థులు 50 మందికి వైఎస్సార్ సీపీ నాయకులు సొంగా సందీప్ ఆదివారం పెన్నులు, స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

టి. నర్సాపురం : ఈనెల 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, ఆధ్వర్యంలో ఆదివారం గోడ పత్రికలను ఆవిష్కరించి గోడలకు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు.


చింతలపూడిలో విశ్వాసుల ప్రదర్శన


లక్కవరం బైబిల్ మిషన్ మహిమాలయంలో ప్రార్థనలు


కొత్తపలిలో మట్టలతో విశ్వాసుల ప్రార్థనలు

ఘనంగా మట్టల ఆదివారం

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంతంలో మట్టల ఆదివారం పండుగను పలు చర్చిల్లో ఘనంగా నిర్వహించారు. ఈతకొమ్మలను రకరకాల పూలతో అలంకరించి విశ్వాసులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా చర్చిల్లో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు సిలువలో తన ప్రాణాన్ని అర్పించి మనుషుల పాపాన్ని విమోచించడానికి చివరిసారిగా విజయోత్సవంలో యెరూషలేములోనికి గాడిదపిల్లను ఎక్కి ప్రవేశించిన రోజున కొందరు మట్టలు పట్టుకుని ఆయనను స్తుతించిన రోజు ఇది అని, ఈ పండుగను మట్టల ఆదివారంగా నిర్వహించుకుంటామని పాస్టర్‌లు తెలిపారు. స్థానిక లూథరన్ చర్చి పాస్టర్ ఆమెన్, సంఘ పెద్దలు ఆల్టర్నేట్ డెలిగేట్ కాశీ విమల కుమారి, మాజీ డెలిగేట్ వెంపా ప్రసంగిరాజు, ట్రెజరర్ బుడుపుల పద్మమాలిని, పీసీసీ తలారి రాజు, తదితరుల ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో లూథరన్ చర్చి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ హోసన్నాకు జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : ప్రభువైన ఏసుక్రీస్తు పాపులను రక్షించడం కోసం సర్వ మానవాళి రక్షణార్థమై వచ్చిన శుభదినం మట్టల ఆదివారము అని గవరవరం ఆర్సీఎం చర్చి పాస్టర్ సౌరి పేర్కొన్నారు. ఆదివారం కొయ్యలగూడెం మండల వ్యాప్తంగా క్రైస్తవ విశ్వాసులు మట్టల ఆదివార దినోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పొంగుటూరు, కొయ్యలగూడెం, రాజవరం, వేదాంతపురం, అంకాలగూడెం, కన్నాపురం గ్రామాలలో మట్టల ఆదివారం సందర్భంగా పురవీధులలో క్రైస్తవ సోదరులు ఈత మట్టలతో ఊరేగింపును నిర్వహించగా చిన్నారులు ప్రధాన ఆకర్షణగా నిలిచారు.


బుట్టాయగూడెంలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవ సోదరులు


కొయ్యలగూడెంలో మట్టల ఆదివారం పండుగలో మట్టలతో చిన్నారుల సందడి

జంగారెడ్డిగూడెం : మండలంలోని అన్ని క్రైస్తవ దేవాలయాల్లో క్రైస్తవ సోదరులు ఘనంగా మట్టల ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఆర్సీఎం చర్చి ఫాదర్ కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ జరిగింది. ఏలూరు రోడ్ లోని ఆర్సీఎం చర్చి నుంచి బస్టాండ్ మీదుగా మసీదు సెంటర్ వరకు పూలతో అలంకరించిన మట్టలు చేతబూని ప్రదర్శన చేశారు. దావీదు రాజుకు జేయము, హోసన్నా అంటూ గీతాలాపన చేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో నిర్మల సిస్టర్స్, క్రైస్తవ విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్ : మట్టల ఆదివారం పర్వదినాన్ని పురస్కరించుకుని లక్కవరం బైబిల్ మిషన్ మహిమాలయంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. పాస్టర్ ప్రభాకర్ మట్టల ఆదివారం విశిష్ఠతను వివరించారు. విశేషంగా అలంకరణ చేసి మట్టలతో క్రైస్తవులు గ్రామంలో క్రీస్తు గీతాలు ఆలపిస్తూ పర్యటించారు.

చింతలపూడి : చింతలపూడి బోయగూడెం ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవ భక్తులు, విశ్వాసులు మట్టలను చేతబూని బోయగూడెం నుంచి ఫైర్ స్టేషన్ మీదుగా పట్టణంలో సువార్త ప్రకటిస్తూ ర్యాలీ జరిపారు. ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి క్రీస్తు గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆర్సీఎం చర్చి ఫాదర్ కామా మాధ్యూ , క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

లింగపాలెం : కొత్తపల్లిలో మట్టల అదివారం పండుగను విశ్వాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలంలోని అన్నిగ్రామాల్లోని చర్చి పాస్టర్ల ఆధ్వర్యంలో మట్టలు చేతపుచ్చుకుని వీధుల గుండా ఊరేగింపుగా వెళ్తూ క్రీస్తు సువార్తను చాటారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.

నవరత్నాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి


దుద్దుకూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం : ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాల తీరుపై ప్రజలకు మరింత అవగాహన పెంచే విధంగా జేసీఎస్ మండల కన్వీనర్‌లు, సచివాలయ కన్వీనర్‌లు కృషి చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దుద్దుకూరులో "జగనన్నే మా భవిష్యత్" ఇంటింటికీ ప్రచార కార్యక్రమంపై ఆదివారం సాయంత్రం నియోజకవర్గంలోని 7 మండలాలకు చెందిన జేసీఎస్ మండల కన్వీర్‌లు, సచివాలయ కన్వీనర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం, జగనన్న అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించి ప్రజామోదం పొందాలని కోరారు. ఈ కార్యక్రమం అమలులో గ్రామస్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కమిటీ, గృహసారథులందరినీ సమన్వయం చేసుకుంటూ కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 7 మండలాలకు చెందిన జేసీఎస్ మండల కన్వీనర్‌లు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

తాడువాయిలో రాస్తారోకో


తాడువాయిలో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : అక్రమ కేసులు ఎత్తివేయాలని, ఆక్రమణలో ఉన్న శ్మశాన వాటికను అప్పగించాలని కోరుతూ మండలంలోని తాడువాయిలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కో కన్వీనర్ విస్సంపల్లి సిద్దు మాదిగ మాట్లాడుతూ తాడువాయిలో మాదిగలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలన్నారు. గత 15 దశాబ్దాలుగా మాదిగలు వినియోగించుకుంటున్న శ్మశాన వాటిక ఊర చెరువును ఒక భూస్వామి కబ్జా చేశాడరన్నారు. అధికారులు తక్షణమే చెరువును సర్వే చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మహాజన సోషలిస్టు పార్టీ గ్రామ అధ్యక్షులు బొడ్డపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి బంగారు గొలుసు బహూకరణ


శ్రీవారి దేవస్థానం ఏఈఓ దుర్గారావుకు బంగారు గొలుసును అందజేస్తున్న దాత ఫణీంద్రరావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్నకు సికింద్రాబాద్‌కు చెందిన సోలేటి ఫణీంద్రరావు సుమారు రూ. 4.05 లక్షలు విలువైన 74.500 గ్రాముల బరువుగల బంగారు గొలుసును ఆదివారం బహుకరించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ బంగారు గొలుసును ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావుకు అందజేయగా, ఆయన దాతకు సంబంధిత రసీదును అందించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు భీమడోలు మండలం గుండుగొలనుకు చెందిన మావులేటి వరుణ్ ఆదివారం రూ.1,60,000 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేయగా, దాతకు దేవస్థానం అధికారులు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అనంతరం దాతకు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

జేఏసీ ఉద్యమ కార్యాచరణ

బుట్టాయగూడెం : మండలంలోని సింగన్నపల్లి కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఆదివాసీ కార్యాచరణ కమిటీ, ప్రజా సంఘాల సమైఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా చైర్మన్‌గా మొడియం శ్రీనివాసరావును మూడవసారి చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానానికి వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. ఈ నెల 10నన సచివాలయాల వద్ద, 17న మండల కార్యాలయం, 24న ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు చేసేవిధంగా కార్యాచరణ రూపొందించుకున్నట్లు మొడియం శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో ఏటీఏ రాష్ట్ర అధ్యక్షులు జలగం రాంబాబు, గౌరవ అధ్యక్షులు తెల్లం రాములు, జిల్లా అధ్యక్షులు సోడెం రాజు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కాకి మధు, జిల్లా అధ్యక్షులు కొమరం వెంకటేశ్వరరావు, న్యూడెమోక్రసీ నాయకులు సరియం రామ్మోహన్ రావు, కారం రాఘవ, పీడీఎస్‌యూ నాయకులు ఈ. భూషణం, జేసీసీ నాయకులు కుర్సం దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన


విద్యార్థుల స్టడీ అవర్స్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బుట్టాయగూడెం: మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఆదివారం ఎంపీడీఓ ఎమ్. శ్రీహరి, ఎంఈఓ టి.బాబూరావు, ఎస్సై ఎం.జయబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీహరి మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఫర్నీచర్, టాయిలెట్ సౌకర్యాలు, తాగునీటి సౌకర్యంతో పాటు ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. హాల్‌టికెట్‌ను చూపించి విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. విద్యార్థులు భయం వీడి ధైర్యంగా పరీక్షలు రాయాలన్నారు. ఎస్సై ఎం. జయబాబు కూడా ఆయా పాఠశాలల్లో పర్యటించి అక్కడి పరిస్థితులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

అదృశ్యమైన వృద్ధుడి మృతదేహం లభ్యం

టి. నరసాపురం : మండలంలోని తెడ్లం గ్రామంలో అదృశ్యమైన 85 ఏళ్ల వృద్ధుడు పాతూరి వీరరాఘవయ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై కె సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తెడ్లం గ్రామానికి చెందిన వృద్ధుడు వీరరాఘవయ్య వయస్సు పైబడడంతో కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా ఉంటున్నాడు. ఈ క్రమంలో గత మార్చి 31న పొలం నుంచి ఇంటికి వెళుతున్నానని చెప్పి ఎటో వెళ్లిపోయాడని, చుట్టు పక్కల వెతికినా కనిపించలేదని అతని కుమారుడు ధర్మారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గ్రామ సమీపంలో ఉన్న పొలాల్లో అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. దీనిపై ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9 మంది జూదరుల అరెస్ట్

టి. నరసాపురం : శింగరాయిపాలెంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావడంతో దాడులు నిర్వహించి 9 మంది జూదరులను అరెస్ట్ చేసి వారివద్ద నుంచి రూ.50,350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె సతీష్ కుమార్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల : మండలంలోని రాజుపాలెంలో ఒక కోడిపందేల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో 4 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 1,600 నగదు, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి సమీపంలో పేకాట స్థావరంపై ఆదివారం స్థానిక పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సద్వినియోగంలోకి కంప్యూటర్ సిస్టం

సాక్షి ఎఫెక్ట్

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు సచివాలయంలో కంప్యూటర్ సిస్టంని సద్వినియోగంలోకి తీసుకువచ్చి పునరుద్ధరించినట్లు ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. సాక్షి దినపత్రికలో ఏప్రిల్ ఒకటవ తేదీన 'కంప్యూటర్ల నిర్వహణలో నిర్లక్ష్యం' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి దీనిపై విచారణ నిర్వహించామన్నారు. ప్రస్తుత సచివాలయం అత్యంత ఇరుకు గదుల మధ్య ఉండగా ఒకటో తేదీ బోర్డు మీటింగ్ నిర్వహించారన్నారు. ఈ నేపథ్యంలో సిస్టంను సచివాలయం వెనుక ఉంచాల్సి వచ్చిందని దీనికి సంబంధించిన సచివాలయ అధికారి వివరణ ఇచ్చారన్నారు. ఇటువంటి చర్యలు పునరావృత్తం కారాదని హెచ్చరించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ సున్నం శాంతకుమారి మాట్లాడుతూ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుందని శ్లాబు వెంట వర్షం నీరు లీకేజీకి గురవుతుందన్నారు. నూతన సచివాలయ నిర్మాణం కాంట్రాక్టర్లు వెంటనే పూర్తి చేసి అప్పగించాల్సిందిగా ఆమె కోరారు.